సాక్షి
కాకినాడ

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం అమలాపురం ఆర్డీఓ వసంతరాయుడు దంపతులు రూ.1,11,116 విరాళం అందజేశారు.



ఆర్టీసీకి శివరాత్రి ఆదాయం

కాకినాడ: మహాశివరాత్రి సందర్భంగా కాకినాడ జిల్లాకు రూ.10.74 లక్షల ఆదాయం సమకూరిందని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

డెల్టాలకు నీరు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 7.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

27న ప్రభుత్వ పాఠశాలల్లో కెరీర్ డే



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ

పిఠాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో 9 నుంచి 12వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు కెరీర్ ఎంపికపై అవగాహన కల్పించాలని డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ ఉపాధ్యాయులకు సూచించారు. పిఠాపురం ఎంఆర్‌సీ భవనంలో బుధవారం విద్యార్థులకు కెరీర్ ఎంపికపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చదువుకుంటున్నప్పుడే కెరీర్ ఎంపికపై అవగాహన కల్పించాలన్నారు. అభిరుచికి తగ్గట్టుగా కెరీర్‌ను ఎంచుకునేలా చూడాలన్నారు. ఇష్టం లేని కెరీర్‌ను ఎంచుకుంటే రాణించలేరన్నారు. ఈనెల 27న జిల్లా వ్యాప్తంగా అన్ని ఉన్నత పాఠశాలల్లో కెరీర్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. పిఠాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి దాట్ల సుభద్ర మాట్లాడుతూ విద్యార్థుల అభిరుచిని తెలుసుకుని సంబంధిత కెరీర్‌ను ఎంచుకునేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఎస్ఎస్ఏ ఏఎంఓ ఎంవీ రామారెడ్డి, ఎంఈఓ ఆర్‌వీ ప్రసాద్, స్టేట్ రిసోర్సు పర్సన్లు జీవీవీ సత్యనారాయణ, వి.లక్ష్మీనారాయణ, జాన్ ప్రసాద్, బావిశెట్టి లక్ష్మీనారాయణ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28న మెగా జాబ్ మేళా

పిఠాపురం: ఈనెల 28వ తేదీన పిఠాపురం ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధికారి డి.హరి శేషు బుధవారం తెలిపారు. ఈ మేళాలో 12 సంస్థలు పాల్గొంటున్నాయని, అర్హతలను బట్టి వేతనం రూ.10 వేల నుంచి 25 వేలు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ఆధార్ కార్డు, ఐడీ నివాస ధ్రువపత్రం తీసుకురావాలని ఆయన కోరారు. వివరాలకు 96664 72877, 90596 41596 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్ట్

ఉండ్రాజవరం: బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి కిడ్నాప్ చేసిన ఇద్దరూ బీహార్ వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఉండ్రాజవరం ఎస్సై కె.రామారావు బుధవారం తెలిపారు. మండలంలో వేలివెన్నులోని ఓ ప్రైవేట్ కాలేజీ వద్ద ఈనెల 19న ఉదయం పేరెంట్స్ విజిటింగ్ పేరుతో చొరబడి ఓ బాలికను ప్రేమ పేరుతో నమ్మబలికి కిడ్నాప్ చేశారు. జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ వీఎస్ఎన్‌వర్మ ఆదేశాలపై రెండు బృందాలుగా ఏర్పడి పోలీసులు గాలించారు. కిడ్నాప్ చేసిన ఇద్దరు బీహార్ వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ.50,001 విరాళంగా అందజేశారు. పూణెకు చెందిన భోగరాజు బ్రహ్మాజీరావు దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

భీమేశ్వరుని హుండీల రాబడి రూ.19.56 లక్షలు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ హుండీల ఆదాయం రూ.19,56,007 లు వచ్చినట్లు ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) బుధవారం విలేకరులకు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 5వ తేదీ నుంచి ఈ నెల 22 వరకు 79 రోజులకు హుండీల ఆదాయం లెక్కించినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ విజయ లక్ష్మి, రామచంద్రపురం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.బాలాజీరామ్‌ప్రసాద్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, అనపర్తి, తాపేశ్వరం గ్రామాలకు చెందిన భీమేశ్వరస్వామి సేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



వెంచర్లకు.. మంచిరోజులు

- కొత్త లే అవుట్లపై చిగురిస్తున్న ఆశలు
- పాత జీఓ ఉపసంహరణతో ఊరట
- రియల్టర్లకు కొత్త ఉత్సాహం
- ఉమ్మడి 'తూర్పు'లో 600 లే అవుట్లు
- రియల్ ఎస్టేట్‌కు పూర్వవైభవం

సాక్షిప్రతినిధి,కాకినాడ: కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు కుదేలైన రియల్ ఎస్టేట్ రంగం పూర్వ వైభవం సంతరించుకోనుంది. ఆర్థిక మాంద్యంతో కొంతకాలంగా ఒడిదొడుకులను ఎదుర్కొంటున్న రంగంలోకి కొత్తగా అడుగుపెట్టేందుకు ఎవరూ సాహసం చేయలేకపోతున్నారు. కొందరు అనధికారికంగా ప్రజలను నమ్మించి మోసం చేస్తోన్న వ్యవహారాలు ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతటికీ గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(గుడా) ఒకటే ఉండేది. జిల్లాల పునర్విభజన తరువాత రాష్ట్ర ప్రభుత్వం గుడాను రెండుగా విభజించిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలుగా ఏర్పాటయ్యాయి.

ఆ జీఓ రద్దుతో ఆనందం

కోవిడ్ తరువాత రియల్ ఎస్టేట్ రంగానికి మరింత ఊతమిచ్చి పరుగులు పెట్టించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనిని శుభ సూచకంగా రియల్టర్లు పేర్కొంటున్నారు. ఇటీవల తీసుకువచ్చిన జీఓ(ఎంఎస్ నంబర్ 13) రియల్టర్ల నెత్తిన పాలుపోసింది. వెంచర్లలో రియల్టర్లు ఐదు శాతం అల్పాదాయ వర్గాలకు కేటాయించాలనే ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించింది. అల్పాదాయ వర్గాల కోసం ఇళ్ల స్థలాల లే అవుట్లలో కొంత భూమిని కేటాయించాలనే ఉత్తర్వులు ఉండేవి. పెద్ద ఎత్తున వచ్చిన విజ్ఞాపనల ఫలితంగా ఈ ఉత్తర్వులను ఉపసంహరిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ తాజాగా ఉత్తర్వులు జారీసింది. దీంతో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపు రానుంది. ఇళ్ల స్థలాల కొనుగోలు చేయాలనుకునే వారికి పక్కా ప్రణాళికతో కూడిన ప్లాట్లు అందుబాటులోకి రానున్నాయి. గతంలో పాత జీఓ వల్ల కొందరు రియల్టర్లు లే అవుట్ల వేయడం నిలిపివేశారు. మరికొందరు పెండింగ్‌లో ఉంచారు. కొన్నిచోట్ల అనధికార లే అవుట్‌లు ఇబ్బడిముబ్బడిగా వేసేశారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడగా, ప్రణాళిక ప్రకారం అందుబాటులోకి రావల్సిన లే అవుట్ల నిలిచిపోయాయి.

గుడాతో ఉత్సాహం

గుడా ఏర్పడ్డాక ప్రజల్లో ధైర్యం వచ్చింది. ప్లాట్లు కొనుగోలుకు ముందడుగు వేస్తున్నారు. గుడా అనుమతితో విశాలమైన రోడ్లు, చక్కని ప్రణాళికతో కూడిన లే అవుట్లు అందుబాటులోకి వచ్చాయి. గుడా లే అవుట్లలో అన్ని అనుమతులు ఉండటంతో బ్యాంక్ రుణాలు తీసు కోవడం చాలా సులభమైంది. దీంతో ప్రజల నుంచి ఆసక్తి పెరిగింది. ఈ క్రమంలోనే ప్రభుత్వానికి గుడా ద్వారా ఏటా రూ.75 లక్షలకు పైబడి ఆదాయం కూడా వస్తోంది. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు 182 లే అవుట్లను అనుమతించింది.

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అనుమతి లేకుండా 1986 లే అవుట్లు వేసినట్టు అధికారులు గుర్తించారు. ఇవి కాకుండా ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) ద్వారా క్రమబద్ధీకరించాల్సిన ప్లాట్లకు మరో 7,044 దరఖాస్తులు పెండింగ్ ఉన్నట్టు లెక్క తేల్చారు. వీటిని క్రమబద్ధీకరించేందుకు కొడా, రుడాలు సిద్ధపడుతున్నాయి. ఆయా అథారిటీల పరిధిలోని ప్రణాళిక విభాగం అధికారులు అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ పనిలో ఉన్నారు. 'ఐదు శాతం' నిబంధన ఉపసంహరిస్తూ జారీచేసిన జీఓపై క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించారు. రెండు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు దీనిపై దృష్టి పెట్టాయి. ఈ చర్యలు అనధికార లే అవుట్లకు చెక్ పెట్టి రియల్ ఎస్టేట్ రంగానికి పూర్వ వైభవం తీసుకువస్తాయనే విశ్వాసం ఏర్పడింది.

జీవో నంబరు 13తో పూర్వ వైభవం



మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పాత ఉత్తర్వుల ఉపసంహరించడం వల్ల రియల్ ఎస్టేట్ రంగానికి పూర్వ వైభవం రానుంది. ఈడబ్ల్యూఎస్‌కు ఐదుశాతం కేటాయించనవసరం లేదు. కొత్త గా లే అవుట్‌లు వేయాలనుకునే రియల్టర్‌లకు ఈ జీఓ పెద్ద ఉపశమనం. రియల్టర్లు ముందుకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలి. అనధికార లే అవుట్‌లు వేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించం.

– సుబ్బారావు, కొడా వైస్ చైర్మన్

సీఎంకు రుణపడి ఉంటాం



పాత జీఓను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు రియల్టర్‌లు రుణపడి ఉంటారు. ఈడబ్ల్యూఎస్‌కు ఐదు శాతం భూమి కేటాయింపు నిబంధన వలన లే అవుట్ల వేస్తే నష్టపోతామని భయపడ్డాం. ఇప్పుడు ఆ నిబంధన ఉపసంహరించుకోవడంతో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుంది. కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రైడె) ప్రజలకు మెరుగైన వసతులతో పక్కా లే అవుట్లు వేసేందుకు కృషి చేస్తుంది.

– కె.విజయ్ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ – క్రైడె కాకినాడ చాప్టర్.

కొత్త ఆవిష్కరణల దిశగా అడుగులు

- సమస్య పరిష్కారానికి మేధో మథనం
- విద్యార్థులతో కలెక్టర్ కృతికా శుక్లా
- జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కారాలను చూపే సరికొత్త ఆవిష్కరణలకు ముందడుగు వేయాలని కలెక్టర్ కృతికా శుక్లా విద్యార్థులకు సూచించారు. కాకినాడ ఏఎంజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. తొలుత ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డీఈవో కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ సైన్స్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్ స్టాళ్లను ప్రారంభించి, విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కృతికా శుక్లా మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం, సీవీ రామన్ వంటి గొప్ప శాస్త్రవేత్తలు మన దేశానికి మంచి పేరు తెచ్చారన్నారు. వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మూడు, నాలుగో తరగతుల నుంచే విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు మేధో మథనం చేసేలా చూడాలన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌లో ప్రయోగాలకు అవసరమైన ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 3–డీ ప్రింటర్లు, 3–డీ స్కానర్లు వంటివి ఉన్నాయని వివరించారు. పాఠశాల ప్రయోగశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో లేజర్ సెక్యూరిటీ సిస్టమ్, రోబోటిక్ వాక్యూమ్ క్లీనర్, హైడ్రాలిక్ వంతెన వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా ఇంజినీరింగ్ బృందాన్ని ఎగ్జిబిషన్‌కు పంపనున్నట్లు వెల్లడించారు. అంతరిక్ష రంగానికి సంబంధించి ఉపగ్రహాలు, వాహక నౌకలు తదితర అంశాలపైనా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఆ దిశగా ప్రాజెక్టులు రూపొందించేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికైనవి, రాష్ట్ర స్థాయికి పంపనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో భాగస్వాములైన విద్యార్థులు, గైడ్ టీచర్లకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారులు డి.సుభద్ర, ఆర్‌జే డేనియల్ రాజు, ఏఎంజీ స్కూల్ కరస్పాండెంట్ రినే వేదమ్, కె.మొహంతి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి ఆర్థిక సాయం



బిళ్లనందూరులో వలంటీర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: ఇటీవల మృతి చెందిన బిళ్లనందూరు గ్రామ వలంటీర్ మాతిరెడ్డి చినశ్రీను కుటుంబాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కోటనందూరులో మృతి చెందిన వార్డు మెంబర్ నండిక ప్రభుదాసు కుటుంబాన్ని కూడా పరామర్శించి, రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాస్, మండల కన్వీనర్ చింతకాయల చిన్నబాబు, పార్టీ నాయకులు రుత్తల జోగిరాజు, కుంచె అచ్చిరాజు, బొత్స సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుర్ల రాజు పాల్గొన్నారు.

26న హ్యాండ్‌బాల్ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. స్థానిక ఐడియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమౌతాయన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెలలో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున పాల్గొంటారన్నారు. ఆసక్తి గల వారు ఎంపికలకు హాజరుకావాలని ఆయన కోరారు. వివరాలకు 72072 33939 నెంబరులో సంప్రదించాలని వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆ మూడు ఆస్పత్రుల్లోనే సరోగసి, ఏఆర్టీ సేవలు

కాకినాడ క్రైం: సరోగసి నిర్వహణ, ఏఆర్‌టీ లెవెల్–2 సేవలు అందించేందుకు కాకినాడలో మూడు ఆస్పత్రులకు అనుమతి ఇస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. సదరు పత్రాలను ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలకు అధికారులు బుధవారం అందజేశారు. కాకినాడ కోకిలా సెంటర్‌లో ఉన్న సృజన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు సంజీవి మామ్ ఫెర్టిలిటీ సెంటర్, రాం భాస్కర్ ఐవీఎఫ్ సెంటర్లకు ఈ అనుమతులు జారీ చేసినట్లు ఇంచార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ తెలిపారు. ఏఆర్‌టీ, సరోగసి సేవలు పొందాలనుకునే వారు ఆయా ఆసుపత్రుల్లో మాత్రమే పొందాలని సూచించారు. జిల్లాలో మరే ఆసుపత్రికీ అనుమతులు ఇవ్వలేదని ప్రకటించారు. తమ శాఖ అనుమతులు పొందని వైద్యులెవరైనా సరోగసీ, ఏఆర్‌టీ సేవలు అందిస్తే చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు, వైద్య కేంద్రం అనుమతులు రద్దు చేస్తామని డాక్టర్ రమేష్ అన్నారు.

రెండు బైకులు ఢీ : ఒకరి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రెండు బైకులు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. బిక్కవోలు మండలం బొమ్మలపేటకు చెందిన మేడిశెట్టి వెంకటదుర్గాప్రసాద్ బుధవారం బైకుపై బొమ్మూరు నుంచి అనపర్తి వైపు వెళ్తున్నాడు. రాజవోలు ఆర్‌కె.గార్డెన్స్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న కారును తప్పించబోయాడు. ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో బైకును ఢీకొన్నాడు. ఈ బైకుపై ఉన్న తండ్రీ కొడుకులు అంబటి రామకృష్ణ(60), మణితేజ వెంటనే కింద పడిపోయారు. రామకృష్ణ తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందాడు. గాయపడిన మణితేజ, వెంకట దుర్గాప్రసాద్‌లను ఆస్పత్రికి తరలించారు. తండ్రీకొడుకులది అనపర్తి మండలం పాలమూరు. కేసు నమోదు చేసినట్లు ధవళేశ్వరం ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

సత్యదేవుడిని దర్శించిన 20 వేల మంది

అన్నవరం: రత్నగిరివాసుడు సత్యదేవుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. బుధవారం స్వామివారిని సుమారు 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తుల తరలిరావడంతో ఆలయ ప్రాంగణం, వ్రతమండపాలు, విశ్రాంతి మండపాలు, క్యూలైన్లు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి స్వామివారి వ్రతాల నిర్వహణ ప్రారంభించి, దర్శనానికి అనుమతించారు. సాధారణ దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. సత్యదేవుని వ్రతాలు 1,800 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో 4 వేల మందికి భోజన సౌకర్యం కల్పించారు.

ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు తప్పనిసరి

కలెక్టర్ కృతికా శుక్లా



వీడియో కాన్ఫరెన్స్‌ల్లో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు నూరుశాతం ఫేసియల్ రికగ్నేషన్ హాజరు నమోదుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు ఉన్నతాధికారులతో అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జేసీ ఎస్.ఇలక్కియతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో కృతికా శుక్లా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ ఆధారిత హాజరు నమోదుపై ప్రత్యేకంగా దృష్టి సారించినందున ప్రభుత్వ ఉద్యోగులు అందరూ తప్పనిసరిగా ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు చేసేలా ఆయా విభాగాల అధిపతులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సుస్థిర ఆక్వా కల్చర్‌కు ప్రోత్సాహం

రాష్ట్ర ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, కమిషనర్ కన్నబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హాజరయ్యారు. పర్యావరణ హితమైన సుస్థిర ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహించడం, ఆక్వా ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం, ఆక్వా కార్యకలాపాలు జరిగే ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి తదితర లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం 2019లో ఆక్వా జోన్లను నోటిఫై చేసిందన్నారు. ఈ జోన్ పరిధిలో విస్తరణకు అవసరమైన సమగ్ర సర్వే, క్షేత్రస్థాయి పరిశీలనపై సమావేశంలో చర్చించారు.

క్లుప్తంగా

కుడుపూడి మరో సెట్ నామినేషన్

కాకినాడ సిటీ: తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు బుధవారం కొత్తగా ఏ ఒక్కరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. మంగళవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కుడుపూడి సూర్యనారాయణరావు బుధవారం మరో సెట్టు నామినేషన్ రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

కొత్త విషయాలు తెలుసుకోవాలి

సామర్లకోట: మహాత్మాగాంధీ ఎన్ఆర్‌జీఎస్‌లో తెలియని అనేక విషయాలను తెలుసుకోవడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా డ్వామాలోని అధికారులు విస్తరణ శిక్షణ కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నట్లు పీఆర్అండ్ ఆర్‌డీ స్టేట్ టెక్నికల్ రీసోర్సుపర్సన్ కె.స్వరూపరాణి తెలిపారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న డ్వామా ఏపీడీ, ఏపీఓ, ఏసీ, టెక్నికల్ అసిస్టెంట్లకు మూడు రోజుల శిక్షణను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మార్చి 18వ తేదీ వరకు శిక్షణలు ఉంటాయని తెలిపారు. ఈ శిక్షణతో సిబ్బంది మరింత ఉత్సాహంగా, బాధ్యతతో పని చేస్తారని ఆమె చెప్పారు. ప్రతీ బ్యాచ్‌కు మూడు రోజుల శిక్షణ ఉంటుందన్నారు. మొబైల్ యాప్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన పెరిగేలా శిక్షణ ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనుల గుర్తింపు, అంచనాలు తయారీ, మొక్కలు నాటడం, పుస్తకాల నిర్వాహణ అంశాలపై శిక్షణ ఉంటుందని చెప్పారు. జిల్లా రీసోర్సు పర్సన్లు ఎం.సత్యనారాయ, టి.సత్యనారాయణ, శ్రీధర్, శ్యామల, సాగర్, ఈటీసీ ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, వెంకటేశ్వరరావు మొదటి రోజు శిక్షణ నిర్వహించారు. శిక్షణ పర్యవేక్షణ అధికారి (డ్వామా ఏపీడీ) ఎల్. రామారావు పాల్గొన్నారు.

పాఠాలు సులువుగా..



తరగతిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలకు తోడుగా బైజూస్ యాప్‌లో పాఠాలు మరింత ఉపయోగపడుతున్నాయి. పాఠశాలలో నేర్చుకున్న పాఠ్యాంశాలకు అదనపు సమాచారం బైజూస్‌లో లభ్యమవుతుంది. కోవిడ్ సమయంలో ట్యాబ్స్ లేక చదువును కోల్పోయాం.

– బొంతు ఇందు, 8వ తరగతి విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్, తొండవరం, అంబాజీపేట మండలం

ఉచితంగా అందజేశారు



వేలాది రూపాయలు విలువైన ట్యాబ్స్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఉచితంగా అందజేశారు. విద్యలో మరింతగా రాణించాలనుకునే వారికి ట్యాబ్స్ ఉపయోగపడుతున్నాయి. మరింత మెరుగ్గా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి బైజూస్ కంటెంట్ చక్కగా ఉపకరిస్తుంది.

– బి.జనని, 8వ తరగతి విద్యార్థిని, విలస, అయినవిల్లి మండలం

విజ్ఞానాన్ని పెంచుకునేందుకు



విద్యార్థులు వారు నేర్చుకున్న చదువుకు అదనంగా విజ్ఞానాన్ని పెంచుకునేందుకు ట్యాబ్స్ ఎంతగానో దోహదపడతాయి. ఉపాధ్యాయులు కూడా ట్యాబ్స్‌ను ఉపయోగించుకోవడం వల్ల వారి పరిజ్ఞానాన్ని మరింతగా పెంచుకోవచ్చు. ట్యాబ్స్ వినియోగంపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం.

– ఎస్.అబ్రహం, డీఈవో, రాజమహేంద్రవరం

నిత్యం పర్యవేక్షిస్తున్నాం



8వ తరగతి చదువుతున్న విద్యార్థులతో పాటుగా, వారికి బోధన చేస్తున్న ఉపాధ్యాయులందరికీ బైజూస్ కంటెంట్‌తో ఉన్న ట్యాబ్స్‌ను అందజేశాం. ట్యాబ్స్‌ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకునేలా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. సాంకేతిక నైపుణ్యంతో పాఠ్యాంశాల్లో పరిజ్ఞానాన్ని పెంచుకుని అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు విద్యార్థులు ట్యాబ్స్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు.

– ఎం.కమలకుమారి, డీఈవో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

టిప్‌ట్యాబ్‌గా స్కూల్‌కు

- కార్పొరేట్‌ను మరపిస్తున్న సర్కారీ విద్య
- సద్వినియోగమవుతున్న బైజూస్ కంటెంట్ యాప్
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల అందజేత



ట్యాబ్స్‌ను వినియోగిస్తున్న విద్యార్థులు

రాయవరం: చేతిలో ట్యాబ్..భుజానికి బ్యాగ్..చూడచక్కని యూనిఫామ్..కాళ్లకు నాణ్యమైన షూస్‌తో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ స్కూల్ స్టూడెంట్లను మరపించేలా బడిబాట పడుతున్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో లేని ట్యాబ్స్‌ను ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇవ్వడం ప్రభుత్వ పాఠశాలల చరిత్రలో సువర్ణాధ్యాయంగా చెప్పవచ్చు. బైజూస్ కంటెంట్‌తో ఉన్న ట్యాబ్స్‌ను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికాబద్ధంగా సర్కారు పాఠశాలల్లో చదువులు సాగుతున్నాయి.

డిజిటల్ చదువులు

సర్కారు పాఠశాలలకు సాధారణంగా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందినవారే అధికంగా వస్తారు. వారికి ఉన్నత విద్యను అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందించేందుకు తీసుకున్న నిర్ణయం దేశ వ్యాప్తంగా అందరి చూపులు ఏపీ వైపు పడేలా చేసింది. ఇప్పటికే మనబడి నాడు-నేడు పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారగా, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద వంటి పథకాలతో పేదల చదువులను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పుడు విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించేందుకు మరో ముందడుగు పడినట్లైంది. 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లు పట్టుకుని పాఠశాలలకు వెళ్తున్న తీరు ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ లుక్‌ను తీసుకువచ్చింది. ట్యాబ్స్ పట్టుకుని వెళ్తున్న చిన్నారులను చూసి తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా ట్యాబ్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ట్యాబ్స్ పంపిణీ నూరు శాతం పూర్తవ్వడమే కాకుండా ప్రతి విద్యార్థి ట్యాబ్స్‌ను వినియోగించుకునేలా నిత్యం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల ద్వారా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. సాధారణంగా ఎగువ తరగతికి చెందిన విద్యార్థులే ట్యాబ్స్‌ను వినియోగిస్తుంటారు. ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్య తరగతికి చెందినవారు కూడా ట్యాబ్స్ వినియోగిస్తూ విజ్ఞానాన్ని మరింత పెంచుకునేందుకు దోహదపడుతుంది.

బైజూస్ ట్యాబ్స్ ఇలా..

సామ్‌సంగ్ కంపెనీ ట్యాబ్స్‌తో పాటు సెక్యూర్డ్ డిజిటల్ కార్డ్‌ను అందించారు. విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యేలా ప్రీలోడెడ్ బైజూస్ కంటెంట్‌ను అందులో పొందుపర్చారు. ఆఫ్‌లైన్‌లో పాఠాలు వినే అవకాశం కల్పించారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా అవాంఛనీయ సైట్లకు చెక్ పెట్టారు. ఇక పిల్లలు ట్యూషన్‌కు వెళ్లాల్సిన అవసరం రాకపోవచ్చు.

బైజూస్ ఉపయోగంపై ఆరా

ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ట్యాబ్, బైజూస్ కంటెంట్‌కు సుమారు రూ.37వేలు ఖర్చు చేసింది. ఒక్కో పాఠశాలకు ట్యాబ్స్‌పై ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించింది. ట్యాబ్స్ ఇచ్చేసి ఊరుకోకుండా ప్రతి విద్యార్థి ట్యాబ్స్ ఉపయోగిస్తున్నారా? లేదా? అనే విషయంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ట్యాబ్స్ తీసుకున్న ఉపాధ్యాయుడు, విద్యార్థి ట్యాబ్స్‌లో కంటెంట్‌ను ఎంత మేర వినియోగిస్తున్నారు.. ఇప్పటి వరకు ఒక్కో విద్యార్థి ట్యాబ్‌లో ఉన్న టెస్ట్‌లను పూర్తి చేస్తున్నారా? లేదా? తదితర విషయాలపై మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల వరకు దృష్టి కేంద్రీకరించారు. పాఠశాలల తనిఖీల్లో భాగంగా ట్యాబ్స్ వినియోగాన్ని పరిశీలన చేస్తున్నారు. ప్రతి ట్యాబ్‌లో 184 టెస్ట్‌లు ఉన్నట్లుగా సమాచారం. ప్రతీ విద్యార్థి ట్యాబ్స్‌లో ఉన్న సబ్జెక్టుల వారీగా కంటెంట్‌లను చూసి, పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

రివిజన్ చేసుకుంటాను



ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను ఇంటి వద్ద రివిజన్ చేసుకునేందుకు ట్యాబ్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఏ విధమైన సందేహాలు వచ్చినా వెంటనే ట్యాబ్స్ ద్వారా నివృత్తి చేసుకుంటున్నాను. ట్యాబ్స్ ద్వారా విజ్ఞానాన్ని పెంచుకుంటున్నాం.

– సంపంగి కేశవ సత్యనారాయణ స్వామి, 8వ తరగతి విద్యార్థి, జెడ్పీహెచ్ఎస్(బాలురు), రాజోలు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	ఉపాధ్యాయులు
కాకినాడ	369	18,254	2,569
కోనసీమ	292	14,556	2,478
తూర్పు	262	15,943	2,183

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం జరిగింది. ఈ వివరాలను బుధవారం రాత్రి కేంద్రపార్టీ కార్యాలయం ప్రకటించింది. జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ముఖ్యమంత్రి జగన్ సూచించినట్టు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు.

విభాగం	అధ్యక్షుడు	నియోజకవర్గం
యువజన	కొప్పన శివనాథ్	పిఠాపురం
మహిళా	వర్ధినీడి సుజాత	పిఠాపురం
రైతు	బొంగు ఉమారావు	తుని
బీసీసెల్	ఈగల అప్పారావు	ప్రత్తిపాడు
ఎస్సీసెల్	శెట్టిబత్తుల కుమార్‌రాజా	ప్రత్తిపాడు
ఎస్టీసెల్	చింతల రాజు	ప్రత్తిపాడు
వైఎస్సార్‌టీయూసీ	దుగ్గన నాగరాజు(బాబ్జీ)	కాకినాడ సిటీ
గ్రీవెన్స్‌సెల్	తోటకూర శ్రీనివాస్	కాకినాడ రూరల్
వాణిజ్యం	మట్టపల్లి సందీప్	జగ్గంపేట
వీవర్స్	పంపన రామకృష్ణ	కాకినాడ రూరల్

వీఐపీలతో వచ్చేవారు దర్శనం టిక్కెట్ తీయాల్సిందే

అన్నవరం: సత్యదేవుని దర్శనానికి వీఐపీలతో కలిసి వచ్చేవారు అంతరాలయ దర్శనానికి ఇకపై రూ.200 టిక్కెట్ తీసుకోవల్సి ఉంటుంది. ఇప్పటి వరకు వీఐపీలతో ఎంతమంది వచ్చినా ఉచితంగా అంతరాలయ దర్శనానికి అనుమతించేవారు. ఇకపై ఆరుగురిని మాత్రమే అనుమతించాలని దేవదాయశాఖ కమిషనర్ డాక్టర్ హరి జవహర్‌లాల్ గతంలోనే ఆదేశాలిచ్చారు. అవి దేవస్థానంలో అమలు కావడం లేదని కమిషనర్ దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన మళ్లీ ఆదేశాలు జారీ చేసి రోజూ వీఐపీలతో ఎంతమందికి టిక్కెట్లు విక్రయించారో నివేదిక పంపాలని ఆదేశించారు. దీంతో స్వామివారి ప్రధానాలయం వద్ద, దిగువన యంత్రాలయం వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఈఓ సత్యనారాయణ మూర్తి తెలిపారు.

దళితులంతా సీఎం జగన్ వైపే

ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్

అల్లవరం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటిస్తూ మాదిగలకు అగ్రస్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే దళితులంతా ఉంటామని ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఆయన అల్లవరం మండలం గోడిలోని తన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సామాన్యుడైన తనను శాసనమండలి వరకు తీసుకెళ్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీలకు కేటాయించి సామాజిక న్యాయం పాటించారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని, బీసీలకు అగ్రస్థానం ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సమస్యలకు పరిష్కారం చూపుతున్నారని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరుకున్న నిజమైన సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వల్లనే సాధ్యమవుతుందన్నారు. 2014 ఎన్నికల్లో మాదిగలకు అసెంబ్లీ సీటు కేటాయిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు మాట ఇచ్చి నిలబెట్టుకోలేక పోయారని విమర్శించారు. ఎవరైనా ఎస్సీలుగా పుట్టాలని కోరుకుంటారా అని చంద్రబాబు చాలా నీచంగా మాట్లాడారని గుర్తు చేశారు. దళితులంటే చంద్రబాబుకి గౌరవం లేదని అన్నారు. చంద్రబాబుని దళితులు ఎప్పటికి నమ్మలేరని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దళితులకు సముచిత స్థానం దక్కిందని ఇజ్రాయిల్ అన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 175 స్థానాలు గెలుస్తుందని, ఆ దిశగా గ్రామ స్థాయి నుంచి పార్టీ విజయానికి కృషి చేస్తానని ఇజ్రాయిల్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గడప గడపకు అందేలా శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తానని తెలిపారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ పాల్గొన్నారు.

కదిలించిన 'శ్మశాన కురుక్షేత్రం'



నాటకంలో ఓ సన్నివేశం

- యుద్ధం తరువాత ఇరుపక్షాల భావోద్వేగాలు
- వీరమరణం పొందినవారికి, విజేతలకూ వేదనే
- చక్కటి హావభావాలను పండించిన నటీనటులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): యుద్ధం జరుగకుండా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకుంటే ఇరు దేశాల ప్రజలకు మేలు జరుగుతుంది. అలాకాకుండా పంతాలకు, పట్టింపులకు పోయి యుద్ధమే అనివార్యం అయినప్పుడు ఇరు పక్షాలలో వేలాది మంది సైనికులు ప్రాణాలు పణంగా పెడతారు. ఇరుపక్షాల వారు అన్నదమ్ముల బిడ్డలైతే వారిలో నెగ్గిన వారి పరిస్థితి ఏమిటీ? ఓడిన వారి పరిస్థితి ఏమిటో 'శ్మశాన కురుక్షేత్రం' నాటకం ద్వారా కళ్లకు కట్టారు. ప్రముఖ మలయాళ కవి కువెంపు మహాభారత కురుక్షేత్ర యుద్ధం భయంకర పరిణామాలపై రచించిన ఈ నాటకాన్ని దర్శకురాలు ఆద్యంతం హృదయానికి హత్తుకునేలా తీర్చిదిద్దారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో 22వ భారత్ రంగ్ మహోత్సవంలో భాగంగా బుధవారం రాజమహేంద్రవరం శ్రీఆనం కళాకేంద్రంలో నాలుగో రోజు కర్ణాటక వారి బ్యాంక్ ఆఫ్ స్టేజ్ థియేటర్ బృందం ఈ నాటకాన్ని ప్రదర్శించింది.

నాటక సారాంశం..

మహాభారతంలో 18 రోజుల పాటు సాగిన కురుక్షేత్ర యుద్ధం గురించి అందరూ వినే వుంటారు. చదివి తెలుసుకుని ఉంటారు. యుద్ధ పర్యవసానాలు, ప్రాణాలతో బయటపడినవారి బాధలు, పశ్చాత్తాపాలు, వేదన, ఆందోళన, ఆలోచన, ఆత్మ పరిశీలనను దర్శకురాలు సవితా భైరప్ప చాలా చక్కగా ఆవిష్కరించారు. కన్నడ భాషలో ప్రదర్శించిన ఈ నాటకంలో నటీనటుల హావభావాలు చాలా చక్కగా పలికించారు.

ఉత్సాహంగా హాకీ పోటీలు



తలపడుతున్న తమిళనాడు-మహారాష్ట్ర జట్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న జాతీయ విమెన్ సీనియర్స్ హాకీ చాంపియన్ షిప్ పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. మొదటి మ్యాచ్ మహారాష్ట్ర, తమిళనాడు జట్ల మధ్య జరిగింది. మహారాష్ట్ర జట్టు 8-0 స్కోర్‌తో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ జట్లు పోటీ పడ్డాయి. పుదుచ్చేరి 13-0 స్కోర్‌తో విజయం కైవసం చేసుకుంది. మూడో మ్యాచ్‌లో మధ్యప్రదేశ్, ఢిల్లీ జట్లు తలపడ్డాయి. మధ్యప్రదేశ్ జట్టు 7-1 స్కోర్ తేడాతో గెలిచింది. నాలుగో మ్యాచ్‌లో మణిపూర్, తెలంగాణ పోటీపడ్డాయి. 13-0 స్కోర్‌తో మణిపూర్ విజయం సాధించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్‌రాయ్, కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారి పీటర్, టోర్నమెంట్ కో-ఆర్డినేటర్ వి.రవిరాజు, పరిశీలకుడు భూపేంద్రసింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు.

లారీ డ్రైవర్‌కి 15 నెలల జైలు

తుని రూరల్: విశాఖపట్నం జిల్లా గాజువాక (అగనంపూడి)కి చెందిన లారీ డ్రైవర్ రుద్రరాజు నారాయణరాజుకి తుని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి 15 నెలలు సాధారణ జైలు శిక్ష, రూ.30,500 జరిమానా విధించినట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ బుధవారం తెలిపారు. తుని మండలం తేటగుంట శివారు రాజులు కొత్తూరువద్ద 2016 జనవరి 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మెట్టగూడెంకు చెందిన మేదర మెట్ల హనుమంతురావు (52) మృతి చెందాడు. ఈ సంఘటనపై అప్పటి రూరల్ ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేశారు. కోర్టులో వాదోపవాదాలు జరగగా నేరం జరిగినట్టు నిర్ధారణ అవడంతో జడ్జి డ్రైవర్‌కు జైలు శిక్ష, జరిమానా విధించినట్టు ఎస్సై తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ ఎస్.సునీత వాదించారు.